# ప్రమాదకరంగా బావి..



మర్పల్లిలో చెత్త, మురుగు నీటితో నిండిన బావి

మర్పల్లి, ఏప్రిల్ 21 : మండల కేంద్రంలోని కబ్రాస్తాన్ ఎదురుగా చెత్త, మురుగు నీటితో నిండిపోయి బావి ప్రమాదకరంగా మారింది.. బస్టాండ్ సమీపం నుంచి, అలాగే బీసీ కాలనీలోని మురుగు నీళ్లు అండర్ డ్రైనేజీ ద్వారా ఆ బావిలోకి వస్తాయని, అందులో చెత్తవేయడం వల్ల చెత్త, మురుగు నీరుతో భూమి లేవల్ ఏర్పడింది.. దీంతో పశు వులు మేతమేస్తూ అందులో పడి మృతి చెందుతున్నాయని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. రెండు మూడు మేకలు అందులోపడి మృతి చెందాయని, మనుషులు ఎవరై నా అటుగా వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.. పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడంలేదని కాలనీ వాసులు పేర్కొంటున్నారు.

### రెండు మేకలు మృతి చెందాయి



బావి మొత్తం చెత్త మురుగునీటితో నిండిపోయి ప్రమాదకరంగా ఏర్పడింది. కొన్ని రోజు ల క్రితం రెండు మేకలు అందులో పడి మృతి చెందాయి.. అటుగా మనుషులు ఎవరైనా వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది.. ఎన్నో సార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు.. సోమవారం మధ్యా హ్నం ఓ మేక మేత మేస్తూ అందులో పడింది.. తాడు సాయంతో బయటకు తీశాం.. అధికారులు స్పందించి బావిని పూడ్చాలని కోరుతున్నాను..

– గఫార్, మర్పల్లి కలాన్,

# ఈ రోడ్డుకు మోక్షం లేదా ?

దోమ, ఏప్రిల్ 21: మండల పరిధిలోని పాలేపల్లి, అయినాపూర్, మల్లేపల్లి గ్రామాల మధ్య కంకర తేలి గుంతలమయమై ప్రయాణం నరక ప్రాయంగా మారింది.ఈ రహదారి పరిగి నుంచి దోమ మీదుగా కోస్గి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2023 చివరిలో ఎన్నికల కంటే ముందు రోడ్డుపనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఓ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి రోడ్డు సైడ్లతో పాటుగా చిన్న గుంతలుగా ఉన్న రోడ్డును కొత్త రోడ్డు వేస్తామంటూ అక్కడక్కడ రోడ్డును తవ్వి వదిలేశాడు. దీని కారణంగా గత 15 నెలలుగా వాహనాలు తిరగడంతో గుంతలు పెద్ద గోతులుగా మారాయి. కొన్ని చోట్ల కల్వర్టులు కూలి ప్రమాదకరంగా మారింది.అయినప్పటికీ ప్రయాణికుల బాధలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించు కోవడం లేదని చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పరిగి నుంచి దోమ మీదుగా పాలేపల్లి, అయినాపూర్, మల్లేపల్లి గ్రామాల మీదుగా కోస్గి వెళ్లే ప్రధాన రహదారికి మోక్షం కలిగేలా కార్యాచరణ చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



కంకర తేలిన బీటీ రోడ్డు దుస్థితి



అయినాపూర్‌లో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

### ఆందోళన చేస్తాం !



పరిగి నుంచి దోమ మీదుగా కోస్గి వెళ్లే ప్రధాన రహదారి పాలే పల్లి, అయినాపూర్, మల్లేపల్లి గ్రామాల మధ్య రోడ్డు గతంలో తవ్వి వదిలేసిన పరిస్థితి.అటుగా పలుమార్లు ప్రయాణించిన స్థానిక ఎమ్మెల్యే చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులకు సైతం ఈ రోడ్డు దుస్థితి కానరావడం లేదేమో! ఇప్పటికైనా ఈ రోడ్డుకు మోక్షం కలుగక పోతే ఇబ్బంది పడుతున్న గ్రామాల నుంచి ప్రజలను పోగు చేసి ఆందోళన చేస్తాం

–గోవర్ధన్ ముదిరాజ్ ,అయినాపూర్ ,దోమ

### ప్రయాణం నరక ప్రాయం..



దోమ మండల కేంద్రానికి వివిధ పనులపై వెళ్లే ప్రజలకు దోమ మీదుగా కోస్గి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రయాణం నరక ప్రాయంగా మారింది. ఇంతనో అంతనో మామూలు గుం తలు ఉన్న రోడ్డును తవ్వి వదిలేయడంతో రోడ్డు మొత్తం కంకర తేలడమే కాకుండా రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు పడటంతో వాహన దారులు ఎంతో మంది ప్రమాదాలకు గురైనా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కావడం లేదు. ప్రజా పాలన అంటూ ప్రజల గోస ను పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వం వెంటనే ఈ రోడ్డుపై కొత్త బీటీ రోడ్డును వేసి ప్రయాణం సులభతరం చేయాలి....

–జోగు గుణవర్ధన్,మల్లేపల్లి ,దోమ



యాలాల్, ఏప్రిల్21: మండల పరిధిలోని దేవనూర్ జడ్పీహెచ్ఎస్ జీహెచ్ఎమ్ మాధురి ఉద్యోగ విరమణ సందర్భంగా తాండూరు పట్టణం సల్లా గార్డెన్‌లో పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు.బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర బీసీ కమీషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, ఎంఈవో రమేశ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కులకచర్ల, ఏప్రిల్ 21 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 1984–85 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు నాటి మధురానుభూతులను ఒకరికొకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కులకచర్ల ఎంఈవో అబీబ్ హైమద్, పూర్వ ఉపాధ్యాయులు మహేందర్‌జీ, జి .కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణరావు, హనుమయ్య, ఆంజనేయులు, పూర్వ విద్యార్థులు 50 మంది వరకు పాల్గొన్నారు.

## పశువులకు వడదెబ్బ తగులకుండా చూడాలి



మర్పల్లి, ఏప్రిల్ 21 : ఎండాకాలంలో పశువులకు వడదెబ్బ తగులకుండా జాగ్రత్తపడాలని పశువైద్యాధికారిణి విజయలక్ష్మి అన్నారు.. సోమవారం మండలంలోని గుర్రంగట్టు తండాలో పశువైద్యశిబిరం ఏర్పాటు చేసి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని, ఎండల తీవ్రత, వడగాలుల కారణంగా పశువులు అనారోగ్యానికి గురయ్యే అవకాశముందని తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ .. నలుగురికి తీవ్ర గాయాలు

పెద్దేముల్, ఏప్రిల్ 21: మండల పరిధిలోని గోపాల్‌పూర సమీపంలో సోమవారం రెండు బైకులు ఢీ కొన్న ఘటనలో నాగులపల్లి గ్రామానికి చెందిన గుల్ల నాగరాజు, మహేశ్‌రెడ్డి, దోమ నర్సింహా, కురువ నవీన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన విరించి ఆస్పత్రి వారి సౌజన్యంతో నడుపుతున్న అంబులెన్స్‌లో తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసత్రికి తరలించారు. నలుగురిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉందని, ప్రథమ చికిత్స అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాదర్ రెఫర్ చేసినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

### అనుమతులు లేకుండా

## మొరం తరలింపు

ఇంటి యజమానికి రూ. 10 వేల జరిమానా



బషీరాబాద్, ఏప్రిల్ 21: ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలించడంపై రెవెన్యూ అధికారులు సోమవారం విచారణ జరిపి సదరు ఇంటి యజమానికి రూ. 10 వేల జరిమానా విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కొంత మంది ట్రాక్టర్లలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం మొరంను తరలిస్తుండగా పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం వెళ్లడంతో అక్రమార్కులు మొరం తరలింపు ప్రదేశం నుంచి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం కార్యాలయానికి వచ్చిన తహసీల్దార్‌కు కొంత విషయం తెలపడంతో తహసీల్దార్ వెంకటేశ్ ఆర్ఐ సుధ ను ఇంటి నిర్మాణం వద్దకు పంపించి విచారణ జరిపించారు. విచారణలో మొరం అక్రమంగా తరలించినట్లు తేలడంతో ఆర్ఐ రిపోర్టు ఆధారంగా ఇంటి యజమానికి రూ. 10 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

### విద్యుత్ తీగలను

## సరిచేయాలి

బషీరాబాద్, ఏప్రిల్ 21 : మండల పరిధి నవల్గా గ్రామంలోని మహేందర్ కాలనీలో విద్యుత్ తీగలను సరిచేయాలని గ్రామ స్తులు పేర్కొన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి 11 కేవీ తీగలు ఇండ్లపై నుంచి వెళ్లాయన్నారు. గత కొన్నాళ్లుగా విద్యుత్ తీగలు ఇండ్ల పైనే ఉన్నాయని, గాలి దుమారానికి ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని వారు వాపోయారు. అధికారులు స్పందించి విద్యుత్ తీగలను ఇండ్ల పైనుంచి తొలిగించాలన్నారు.

### నీళ్ల ట్యాంకులో

## మహిళ మృతదేహం

ముషీరాబాద్, ఏప్రిల్ 21: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళా మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చేటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కవాడిగూడలోని డీబీఆర్ మిల్లు నిర్మానుష్య ప్రదేశం లోని నీళ్ల ట్యాంకు నుంచి దుర్వాసన వస్తున్నదని పోలీసులకు సమాచారం అందింది. వారు అక్కడికి వెళ్లి చూడగా.. ట్యాంకులో కుళ్లిన స్థితిలో మహిళా మృతదేహం లభ్యమైంది. దాదాపు మూడు నెలల పైనే అయి ఉండవచ్చునని పోలీసుల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహిళా వయసు దాదాపు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

## రజతోత్సవ సభ పోస్టర్ అవిష్కరణ



గురుదోట్ల గ్రామంలో చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

ధారూరు, ఏప్రిల్ 21: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభని విజయవంతం చేయాలని గురుదోట్ల, అంపల్లి గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం ధారూరు మండల మండల పరిధిలోని గురుదోట్ల, అంపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు చలో వరంగల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

**బొంరాస్‌పేట్:** రజతోత్సవ వేడుకలకు మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోట్ల యాదగిరి, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి కోరారు. తెలంగాణలో ప్రజలు మళ్లీ కేసీఆర్ పరిపాలన రావాలని కోరుకుంటున్నరన్నారు.రజతోత్సవ సభకు ప్రతి ఇంటి నుంచి ఒక్కరు ఊరు నుంచి ఒక వాహనంలో భారీ ఎత్తున వెళ్లి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

## వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



బొంరాస్‌పేట, ఏప్రిల్ 21 : మండల వ్యాప్తంగా పలుగ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ ప్రారంభించారు. రేగడి మైలారం, కొత్తూరు, వడిచర్ల, తుంకిమెట్ల, బొంరాస్‌పేట, మెట్ల కుంట, ఏర్పుమళ్ళ,బాపల్లి గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ అధ్వర్యంలో వరి కొనుగోలు కేం ద్రాలను ప్రారంభించారు. . ఏ గ్రేడ్ ధాన్యం రూ.2320,బీ గ్రేడ్ రూ.2300 ప్రభుత్వం మద్దతు ధర అందిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో నర్సింహగౌడ్, అంజిల్‌రెడ్డి, వెంకట్ రాములు గౌడ్, మల్లేశ్, కృష్ణ,రమేశ్ రాథోడ్, వివిధ గ్రామాల రైతులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు.. పోలీస్ ఆంక్షలు

నగర, రాచకొండ కమిషనరేట్‌ల పరిధిలో అమలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 21(నమస్తేతెలంగాణ): హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నగర పోలీస్ కమిషనరేట్ పరిధితోపాటు రాచకొండ పరిధిలోని సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నగర, రాచకొండ పోలీస్ కమిషనర్‌లు సీవీ ఆనంద్, సుధీర్‌బాబులు పలు ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 23న ఎన్నికల పోలింగ్, 25న కౌంటింగ్ దృష్ట్యా ఈనెల 21న సాయంత్రం నాలుగు నుంచి 23 సాయంత్రం ఐదు గంటల వరకు, 25న ఉదయం ఆరుగంటల నుంచి 26న ఉదయం ఆరుగంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ సమయంలో మద్యం దుకాణాలు బంద్ చేయాలని , ప్రజల శాంతిభద్రతల దృష్ట్యా ఎన్నికల నిర్వహణ సక్రమంగా జరగడానికి జంటనగరాల్లో మద్యం విక్రయించడానికి అనుమతులు లేవని, హోటళ్లు, రెస్టారెంట్లు మద్యం విక్రయించవద్దని సీపీలు ఆదేశాలిచ్చారు. 23న పోలింగ్ ముగియడానికి 48 గంటల ముందు నుంచి జంటనగరాల్లో 5మంది కంటే ఎక్కువ మంది సమావేశాలు నిర్వహించడం, ఊరేగింపులు జరపడం, మైకులు వంటివి వాడడం, ఎలాంటి సమూహాలు ఉండకుండా నిషేధించడమైనదని, అందరూ ఈ ఉత్తర్వులను పాటించాలని సీపీలు పేర్కొన్నారు. 25నన ఓట్ల లెక్కింపు సందర్భంగా రహదారులపై, బహిరంగప్రదేశాల్లో ఫైర్ క్రాకర్స్ ఖచ్చితంగా నిషేధించినట్లు తెలిపారు. 23న పోలింగ్ స్టేషన్లకు 200 మీటర్ల దూ రంలో ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది వ్యక్తుల సమావేశాలను నిషేధించామని తెలిపారు. ఈ నిషేధాంక్షలు 21న సాయంత్రం నాలు గు నుంచి 23వరకు, అలాగే 25న ఉదయం ఆరుగంటల నుంచి 26 ఉదయం ఆరు వరకు అమలులో ఉంటాయని సీపీలు తెలిపారు.

## పాఠశాలలను సందర్శించిన ఎంపీడీవో, ఏఈ

- స్లాబ్ పెచ్చులు ఊడడం, లీకేజీ వివరాల సేకరణ




పరిగి, ఏప్రిల్ 21 : పరిగి మండల పరిధిలోని పలు పాఠశాలలను సోమవారం ఎంపీడీవో ఎం.ఎ.కరీం, మండల విద్యాధికారి గోపాల్, పంచాయతీరాజ్ ఏఈ చాణక్యరెడ్డి సందర్శించారు. ఆయా పాఠశాలల్లోని తరగతి గదులు, ప్రధానోపాధ్యాయుల గది, ఇతర గదులలో స్లాబ్‌కు ఎక్కడైనా పెచ్చులు ఊడడం, స్లాబ్ లీకేజీ అవుతున్న వివరాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సోమవారం మండలంలోని 15 పాఠశాలలను సందర్శించిన అధికారుల బృందం నాలుగైదు పాఠశాలల్లోని తరగతి గదులలో స్లాబ్ పెచ్చులు ఊడడం, స్లాబ్ లీకేజీ అవుతున్నట్లు గుర్తించారు. మంగళవారం మిగతా పాఠశాలలను సందర్శించి వివరాలు సేకరించనున్నారు. పాఠశాలల సందర్శన తర్వాత నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నారు.

## కేజీబీవీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



బంట్వారం, ఏప్రిల్ 21: కేజీబీవీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంఈవో చంద్రప్ప ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని కరీంపూర్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ నూతన భవనాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో పాఠశాల తరగతులు ఇక్కడే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తి చేసి ఇవ్వాలని సైట్ ఇంజీనీయర్ రాంకిశోర్‌కు సూచించారు. ఇదిలావుండగా కోట్‌పల్లి మండలంలోని పలు పాఠశాలల పై కప్పులు, గోడలు అధ్వానంగా మారాయని ఎంఈవో చంద్రప్ప పేర్కొన్నారు. సోమవారం ఆయనతో పాటు ఎంపీడీవో డానియల్ పలు పాఠశాలలను సందర్శించి పరిశీలించారు.మండల పరిధిలోని బార్వాద్ తండా పాఠశాల ఎప్పుడు కూలు తుందో తెలియని స్థితిలో ఉందన్నారు. అదే విదంగా మద్గుల్‌తండా పాఠశాల పై కప్పును కనిష్టంగా ప్లాస్టర్ చేయలేదన్నారు. రాంపూర్, జిన్నారం తదితర గ్రామాల్లో పెచ్చులూ డుతు న్నాయని తెలియజేశారు. అన్ని పాఠశాలల వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు చెప్పారు. మరోవైపు బంట్వారం మండలంలోని మాడల్ స్కూల్ పాఠశాలను ఎంఈవో వెంకటేశ్వర్ రావు, ఎంపీడీవో రాములు, ఏఈ లక్ష్మణ్ సందర్శించి పరిశీలించారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన బోధన



ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలను వివరిస్తున్న హెచ్ఎం వెంకట్‌రెడ్డి

బొంరాస్‌పేట్, ఏప్రిల్21: ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పుమళ్ళ, నాందార్‌పూర్ ప్రధానో పాధ్యాయులు వెంకట్‌రెడ్డి,రామయ్య, ఉపాధ్యాయ బృందంతో కలిసి గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యలను వివరించారు.గ్రామం నుంచి ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులను పంపిస్తున్న వారికి తమ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యలు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు,ఉదయం అల్పాహారం, రాగిజావా, మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్,ఎలాంటి ఫీజులు ఉండవని వివరించారు. వీటితో పాటు విద్యార్థులకు డిజిటల్ తరగతులు,విద్యార్థుల అత్మరక్షణకు కరాటే తరగతులు, విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం ఒత్తిడిలేని విద్యాబోధన ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషన్, సర్దార్, ప్రశాంత్,జ్యోతి, జీవన్, శ్రావణి, కుమార్, కార్యదర్శి శోభారాణి, భార్గవి, విజయలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి..

**కొడంగల్:** ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పించి వారికి ఉజ్వల భవిష్యత్తును అందించాలని హుస్సేన్‌పూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రాంతికుమార్ కోరారు. సోమవారం మండలంలోని హుస్సేన్‌పూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అని సౌకర్యాలతో పాటు పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారన్నారు. వారి ఆధ్వర్యంలో విద్యార్థులు విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అందుకునే అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సంధ్య పాల్గొన్నారు.




## పెట్టుబడిపేరుతో మోసం.. నిందితుడు అరెస్ట్

సిటీబ్యూరో, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధికలాభాలు ఇస్తామంటూ ఆశపెట్టి మోసం చేసిన కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రతీక్‌శుక్లా అనే వ్యక్తిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన 68 ఏళ్ల వ్యక్తి .. మూడు నకిలీ ఆన్‌లైన్ కంపెనీలు తనను మోసం చేశాయని పేర్కొంటూ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 5పైసా క్యాపిటల్ లిమిటెడ్, బార్‌డేస్, షంద క్యాపిటల్ గ్రూప్ లిమిటెడ్ పేరుతో ఉన్న కంపెనీలు మోసం చేశాయని పేర్కొన్న బాధితుడు.. మొదట తనను వీఐపీ 5పైసా గ్రూప్ అనే లింక్ ద్వారా వాట్సప్ గ్రూప్‌లో చేర్చారని, ఆ గ్రూపులో కొంత మంది తనను సంప్రదించి కొత్త సభ్యులంటూ పరిచయం చేసుకుని.. తాము అప్పర్ సర్క్యూట్ షేర్లు, ఐపీఓలు, ఓటీసీ ట్రేడింగ్ మొదలైన వాటిని సిఫారసు చేశారని బాధితుడు తెలిపాడు. అయితే తనకు పరిచయమైన వారు కొన్ని స్క్రీన్ షాట్స్ పంపి తాము లాభాలు పొందామని చెప్పి నమ్మించడంతో తాను రూ. 52,29,500 లను అనేక మార్లు పెట్టుబడిగా పెట్టానని, తర్వాత తాను వారిని సంప్రదించే ప్రయత్నం చేస్తే వారు స్పందించలేదని తెలిపారు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. నిందితుడు ప్రతీక్‌శుక్లా ఈ కేసులో ఖాతాలను సరఫరా చేయడంతో పాటు ఖాతాదారుడు కావడంతో అతనిని అరెస్ట్ చేశామని, ప్రతీక్‌పై దేశవ్యాప్తంగా 9కేసులు ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు.

### బాత్రూమ్‌లో జారిపడి

## బాలిక మృతి

ఎర్రగడ్డ, ఏప్రిల్ 21 : నాలుగేళ్ళ పాపకు నూరేళ్లు నిండాయి. బాత్రూమ్‌లో జారిపడి అపస్మారకస్థితిలోకి వెళ్లి.. చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. నిస్తేజంగా పడిన కుమార్తెను గుండెలకు హత్తుకుని లే బిడ్డా..లే అంటూ ఆ తల్లి గుండెలవిసేలా రోధించడం అందర్నీ కంటతడి పెట్టించింది. విషాదఛాయలు అలముకున్న ఈ ఘటన బోరబండలో చోటుచేసుకుంది. బోరబండ స్వరాజ్ నగర్ లో పశ్చిమ బెంగాల్ కు చెందిన పెయింటర్ గా పనిచేసే ఎండీ రఫీక్.. తమ కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం దంపతులు ఎండీ రఫీక్, నిషా ఇంట్లో ఉన్న సమయంలో వారి ముద్దుల గారాలపట్టి లామ్య (4) బాత్రూమ్ లోకి వెళ్ళింది. అక్కడ బాత్రూమ్ లో జారిపడి తలకు తీవ్రగాయాలై స్పృహ కోల్పోయి అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. జారిపడ్డ శబ్దం విన్న తల్లిదండ్రులు లామ్యను నిలోఫర్ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పాప మృతి చెందింది. బిడ్డా.. అమ్మని వచ్చాను చూడరా.. లే బిడ్డా..లెమ్మంటూ ఆ తల్లి రోధించిన తీరు అందర్నీ కంటతడి పెట్టించింది. ఈ మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.